క్లుప్తంగా

నేడు ఉమ్మాయిపల్లెలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

కొలిమిగుండ్ల: మండలంలోని ఉమ్మాయిపల్లె, తండా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొంటారని చెప్పారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు,అనుబంధ సంఘాల కన్వీనర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

30న ఆకుమల్లలో..

సంజామల: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండలంలోని ఆకుమల్ల గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగ కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల వాణిజ్య విభాగ కార్యదర్శి గౌరి గారి నాగేశ్వర్ రెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొంటారని, నాయకులు,కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కుక్కల నుంచి రక్షణ కల్పించండి

బేతంచెర్ల: పట్టణంలో కుక్కల బెడద నుంచి పసి పిల్లల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ డిమాండు చేశారు. ఆదివారం రాత్రి పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీలో కుక్కదాడిలో గాయపడిన హిమకిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు తిరుమలేష్, దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల నాయకులు ప్రదీప్, మధు, ఫారుఖ్, ఖదీర్, సాయి పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



తూకాల మిషన్లను పరిశీలిస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

బేతంచెర్ల: ప్రభుత్వ చౌక దుకాణాల్లో డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని డోన్ తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని డీలర్లు తూకాల మిషన్ల పనితీరుపై తనిఖీ నిర్వహించారు. డీలర్లకు సరుకుల పంపిణీపై అవగాహన కల్పించారు. తూకాల మిషన్లకు సీల్ వేశారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కోచ్, మాస్టర్లు

బేతంచెర్ల : విజయవాడలోని రామ కోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరిగిన 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో బేతంచెర్ల పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో దివ్య శ్రీ, యశ్వంత్, ప్రశాంత్ వల్లి, జనిత్, ఉత్తేజ్ కుమార్ సిల్వర్ మెడల్స్, సహస్ర, జయ ప్రతీక్, జయరాం, రుత్విక్ సాయి కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మాస్టర్ వెంకటేశ్వర్లు, కోచ్ నాగన్న అభినందించారు.

పేదల పక్షాన సీపీఐ పోరాటం

డోన్ టౌన్ : పేద ప్రజలు, కార్మిక, కర్షక, రైతుల పక్షాన పోరాడే పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు అన్నారు. మండలంలోని బి.రామదుర్గంలో సోమవారం జరిగిన గ్రామ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు చిన్న హనుమంతు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సీనియర్ నాయకులు చిన్నహనుమంతు, అంజనేయ, నెమ్మి లక్ష్మయ్య, లక్ష్మీదేవిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, జిల్లా సమితి సభ్యులు పులిశేఖర్, నాయకులు హుస్సేన్‌పీరా, రామ్మోహన్, పృథ్వీకుమార్, రజాక్ తదితరులు ఉన్నారు.

హాస్టల్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

డోన్ టౌన్: పట్టణంలోని 1వ వసతి గృహంలో అవినీతి జరిగిందని జిల్లా కలెక్టర్ రాజకుమారికి సోమవారం ప్రజా పరిష్కార వేదికలో ఎస్ఎస్‌యూఐ జిల్లా నాయకులు విజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ విషయంపై సంక్షేమశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీద్దాం

- అబద్ధపు హామీలివ్వడం చంద్రబాబుకు అలవాటే
- 143 హామీలేమయ్యాయి?
- గ్రామాల్లో పర్యటించాలంటే టీడీపీ నాయకులకు వణుకు
- రైతు సంక్షేమాన్ని గాలికొదిలేశారు
- 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'లో కాటసాని ఫైర్



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే



వెలగటూరులో నిర్వహించిన సభకు హాజరైన జనం

కోవెలకుంట్ల: ఎన్నికల సమయంలో 143 హామీలిచ్చి అధికారం దక్కించుకుని 14 నెలలు కావస్తున్నా ఒక్క హామీ అమలు చేయని కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీయాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని వెలగటూరులో 'బాబు షూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, కోవెలకుంట్ల రైతు సంఘం నాయకుడు కానాల రవీంద్రనాథరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఉప్పరి నాగేంద్ర, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి, సీనియర్ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, తదితరులు హాజరయ్యారు. సర్పంచ్ ఎల్వీ సుధాకర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కాటసాని మాట్లాడుతూ 14 సంవత్సరాల నుంచి ఎన్నికలకు ముందు అపద్దపు హామీలివ్వడం, అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. హామీలను చూస్తే భయమేస్తోందని అసెంబ్లీలోనే సీఎం చెప్పడం, హామీలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాల్సిందేనని మంత్రులు చెబుతుండటం సిగ్గు చేటన్నారు.

రైతు సంక్షేమం గాలికి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తే ప్రస్తుత కూటమి సర్కార్ రైతు సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా, పంటనష్ట పరిహారం, రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం, పంటలకు గిట్టుబాటు ధర తదితర పథకాలు అమలు చేసి రైతులను ఆదుకుందని వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా రైతులను ఏమాత్రం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు, వరి, మిరప, శనగ, కంది, జొన్న పంటలకు గిట్టుబాటు ధర లేక గోదాముల్లో మగ్గుతున్నాయన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని అటకెక్కించిందని, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ.4,600 కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టిందన్నారు. రూ. 6 వేల కోట్ల ఫీజు రీఇంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారిందన్నారు.

కార్యక్రమంలో నాయకులు సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, ఉప్పరి సుబ్బరాయుడు, పోతం రాంమోహన్‌రెడ్డి, అమడాల శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మోహన్‌రెడ్డి, దండె వెంకటశేషిరెడ్డి, ఏర్వ శేషిరెడ్డి, రామిరెడ్డి, అందె శ్రీనివాసరెడ్డి, సుధాకర్ రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రాజారెడ్డి, భూస భాస్కర్ రెడ్డి, దశరథరామిరెడ్డి, అక్బర్‌బాషా, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి సేనారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సోముల వెంకటేశ్వరరెడ్డి, యువజన నాయకులు రాంభూపాల్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, దనికొండ నాగేశ్వరరెడ్డి, డీసీ ఉశేన్ పాల్గొన్నారు.

మంత్రి అక్రమాల దందా..

నియోజకవర్గంలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి దోపిడీ దందా కొనసాగుతోందన్నారు. బనగానపల్లెలోని రవ్వలకొండను తవ్వేసి విచ్చలవిడిగా కంకరను అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో పేకాట, మద్యం బెల్ట్‌షాపులు నాటసారా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయన్నారు. అన్యాయాలను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు.

పింఛన్ రావడం లేదయ్యా!..



పింఛన్ రావడం లేదని మాజీ ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న సువార్తమ్మ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదంటూ మహిళలు ఏకరువు పెట్టారు. వెలగటూరు గ్రామంలో పర్యటనలో భాగంగా రామిరెడ్డి స్థానిక మహిళలతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగారు. కొత్త పింఛన్లు రావడం లేదని, గ్యాస్ సబ్సిడీ డబ్బులు పడటం లేదని, నెలకు మహిళలకు రూ.1500 ఇవ్వడం లేదని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయడం లేదని మహిళలు కాటసాని దృష్టికి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు ఠంఛన్‌గా అందేవని, జగనన్న ప్రభుత్వమే బాగుండేదని చెప్పారు.

కంటి చూపు లేకపోయినా పింఛన్ రావడం లేదు..

ఒక కన్ను పూర్తిగా కన్పించడం లేదని పింఛన్ కోసం ఏడాది నుంచి ఎదురు చూస్తున్నానని సువార్తమ్మ అనే మహిళ కాటసాని ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. పింఛన్‌కోసం ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయింది. అరకొర కంటి చూపుతోనే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, ఆదుకోవాలని వేడుకుంది.

ప్రియా సిమెంట్ హై స్కూల్ నుంచి బస్సు నడపాలి



ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న సీఐ వెంకటరామిరెడ్డి

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల గ్రామానికి ప్రియా సిమెంట్స్ హై స్కూల్ నుంచి ఫ్యాక్టరీ వారు బస్సు సౌకర్యం కల్పించాలని సోమవారం మహిళలు ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రియా సిమెంట్స్ హై స్కూల్‌లో దాదాపు వంద మందికి పైగా రాచర్ల గ్రామానికి చెందిన విద్యార్థులు చదువుతున్నారన్నారు. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో తమ పిల్లలను ఆటోల్లో పంపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోల్లో పంపడం ద్వారా రవాణా ఖర్చు, మరో వైపు తమ పిల్లలకు భద్రత కరువైందన్నారు. సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పీఆర్‌ఓ కోటేశ్వరరావు ఇచ్చిన హామీతో వారు సంతృప్తి చెందలేదు. తక్షణమే బస్సు సౌకర్యం కల్పిస్తే ఆందోళన విరమిస్తామని మహిళలు తేల్చి చెప్పారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ రమేశ్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే బస్సు సౌకర్యం కల్పించేందుకు యత్నించాలని పాఠశాల యాజమాన్యానికి సీఐ ఆదేశించారు.

గిరిజన కుటుంబాలకు సాగుభూమి ఇవ్వాలి



మాట్లాడుతున్న నరసింహ నాయక్

బనగానపల్లె రూరల్ : అర్హత కలిగిన ప్రతి గిరిజన కుటుంబానికి రెండెకరాల సాగు భూమి ఇవ్వాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఏపీ గిరిజన సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహ నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుగాలి, ఎరకలి, చెంచు, మారాది తదితర భూమిలేని గిరిజన కుటుంబానికి భూమి, ఇల్లు లేని వారికి 3 సెంట్ల స్థలంతో పాటు గృహ నిర్మాణానికి రూ.6లక్షలు ఇవ్వాలని కోరారు. అలాగే గిరిజనుల నుంచి బలవంతంగా భూసేకరణ చేయరాదన్నారు. అనంతరం మండల సంఘం అధ్యక్షుడిగా ఈశ్వర్‌నాయక్, కార్యదర్శి మధుశేఖర్, ఉపాధ్యక్షులు వెంకటలక్ష్మీ, సహాయ కార్యదర్శులుగా కృష్ణుడు నాయక్,సుధాకర్,సక్రునాయక్ గోపాల్ నాయక్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మల్యాల సబ్ స్టేషన్ పరిధిలో రూరల్ డెవలప్‌మెంట్ పనుల కింద 11 కేవీ లైన్ పనులు జరుగుతున్నందున మంగళ, బుధవారాల్లో రెండు రోజులు మల్యాల, సీసంగుంతల గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజులు రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు, మరలా సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

యాగంటీశుడికి పల్లకీ సేవ



యాగంటిలో శివపార్వతుల ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఆలయ ఈఓ పాండురంగా రెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తులను అందంగా ముస్తాబు చేసిన పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగించారు.

ఘనంగా కలశ స్థాపన, గరుత్మంతుడి విగ్రహ ప్రతిష్ఠ



కలశాలకు పూజలు చేస్తున్న వేదపండితుడు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కొలిమిగుండ్ల: పండితుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల లక్ష్మీనరసింహస్వామి నామస్మరణతో కొండపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కొలిమిగుండ్ల కొండపై శ్రీదేవి,భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామి మహా సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు రెండో రోజు సోమవారం కనుల పండవగా జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన 14 మంది వేదపండితుల బృందం ప్రభంద సేవా కాలం, పుణ్యాహవచనం, ధ్వజ కుంభారాధనం,అగ్ని ప్రతిష్ఠ,వాస్తు హోమం,శ్రీవిష్ణు సహస్ర పారాయణ,జలాధివాసం తదితర పూజలు చేపట్టారు. రామ్‌కో యూనిట్ హెడ్ మీనాక్షి సుందరం,ప్రెసిడెంట్ రామరాజు దంపతులతో పాటు జనరల్ మేనేజర్ రవికుమార్, గ్రామ పెద్దలు,ఉభయదారులతో కలశాలకు,గరుత్మంతుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గర్భగుడితో పాటు ఐదు అంతస్తుల గాలిగోపురం పై ఐదు కలశాలను ప్రతిష్ఠించారు. బుధవారం కుంభాభిషేక మహోత్సవం, స్వామి కళ్యాణ మహోత్సవం జరిపించనున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రం ఆవరణలో నంద్యాల శాంతిరాం వైద్యశాలకు చెందిన వైద్యులతో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది.శిబిరంలో వైద్యులు డాక్టర్ అనుదీప్, వసంతలక్ష్మీ బృందం భక్తులతో పాటు పర్యాటకులకు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యాగంటి పల్లె గ్రామ ఉపసర్పంచ్‌బండిమౌలీశ్వరరెడ్డి,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



కోవెలకుంట్ల పట్టణంలోని నాగులకట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు



సంజామలలో నాగదేవత విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు



కొలిమిగుండ్లలో నాగులకట్ట వద్ద పూజలు చేస్తున మహిళలు





బనగానపల్లెలో నాగులకట్టకు పూజలు చేసె దృశ్యం, బేతంచెర్లలో పుట్టకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నాగుల చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వెలసిన పుట్టలవద్దకు మహిళలు పాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లోని నాగుల ప్రతిమలకు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. పట్టణ శివారులోని మార్కెట్‌యార్డు, బనగానపల్లె చౌరస్తా, ఏడుకొప్పెర్లబావి ఆవరణల్లో వెలసిన పుట్టల చుట్టూ మహిళలు ప్రదక్షిణలు చేశారు.

బనగానపల్లె : నాగుల చవితి పండుగ సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరిగింది. మహిళలు ఆయా గ్రామాల్లోని నాలుగకట్టను సందర్శించి నాగుల విగ్రహాలకు పాలు పోసి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న నాగులకట్ట,నాయీబ్రహ్మణ కాలనీలోనున్న, జీఎం టాకీస్ సమీపంలో ఉన్న నాగులకట్టల వద్ద భక్తులు పూజలు చేశారు.

కొలిమిగుండ్ల: సోమవారం నాగులచవితి పండుగను మండల వ్యాప్తంగా మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే ఆయా గ్రామాల్లోని పుట్టలు,నాగుల కట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు.

సంజామల: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సోమవారం నాగులచవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భక్తులు పుట్ట దగ్గరకు వెళ్లి పుట్టలో, నాగ ప్రతిమలకు పాలు పోసి పూజలు చేశారు.

డోన్ టౌన్ : శ్రావణ మాసం నాగుల చవితిని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రజలు నిర్వహించుకున్నారు. ఆషాడ మాసం ముగియడంతో కొత్తగా పెళ్లైన జంటలు నాగుల పుట్టకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న సుబ్రహ్మణేశ్వర స్వామి పుట్టకు, జడ్జి బంగళాలో ఉన్న పుట్టకు, వేంకటేశ్వరస్వామి ఆలయం వీధిలో ఉన్న పుట్టతో పాటు పలు చోట్ల ఉన్న పుట్టలకు భక్తులు, ముఖ్యంగా మహిళలు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

బేతంచెర్ల : మండలంలోని ఆయా గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో నాగుల కట్టల వద్ద, పుట్టల వద్ద మహిళలు, చిన్నారులు, పాలు పోసి, పిండిపదార్థాలతో తయారు చేసిన నైవైద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని అమ్మవారి శాల నాగుల కట్ట, శేషారెడ్డి హైస్కూలు, తహసీల్దార్ కార్యాలయం వద్ద పుట్టలో పాలు పోసి చీరలను పెట్టి నాగమ్మ తల్లి దీవించమ్మ అంటూ మొక్కులు చెల్లించారు.

ఆవుల నుంచి పంటలను కాపాడండి

బేతంచెర్ల : ఆవుల బెడద నుంచి పంటలకు రక్షణ కల్పించాలని రైతు సంఘం నాయకులు నాగభూషణం రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, భద్రారెడ్డి, సంజీవుడు, శ్రీనివాసులు, బుగ్గన రమణారెడ్డి, తిమ్మారెడ్డి కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణికి, బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. పట్టణంలో ఆవులతో వ్యాపారం చేసే వారు నిర్లక్ష్యంగా ఆవులను వదులుతుండటంతో అవి తమ పంటలకు నష్టం కలిగిస్తున్నాయన్నారు.

108 వాహనం పరిశీలన

బనగానపల్లె రూరల్ : పట్టణంలో 108 వాహనాన్ని జిల్లా మేనేజర్ సంజీవరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలో పేషెంట్స్ అత్యవసర సమయంలో ఉండాల్సిన మందులు, ఆక్సిజన్ తదితర పరికరాలు, రికార్డులను పరిశీలించారు. వాహన ఈఎంటీలు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ,డ్రైవర్లు ఓబులేసు,ప్రభాకర్ ఉన్నారు.

వడ్డెర సొసైటీలకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న శిల్పి సుబ్బరాయుడు

కొలిమిగుండ్ల: వడ్డెర సొసైటీలు ఏర్పాటైనా ఇంత వరకు నిధులు కేటాయించలేదని, తక్షణమే నిధులు ఏర్పాటు చేయాలని అఖిల భారత వడ్డెర సామాజిక సంఘం కార్యదర్శి శిల్పిసుబ్బరాయుడు డిమాండ్ చేశారు. సోమవారం అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల ఆవరణలో బండ సుధాకర్ అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో 300 కుటుంబాలకు పైగానే వడ్డెరలు ఉన్నారని వారందరూ నాపరాతి గనుల్లో పని చేస్తున్నారని చెప్పారు. నాయకులు వెంకటకృష్ణ, నాగేశ్వర, నాగాంజనేయులు, గోపాల్, జగన్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ వారు అక్రమ మద్యంపై సోమవారం పట్టణంలో విస్తృత దాడులు జరిపారు. దాడుల్లో 672 టెట్రా ప్యాకెట్లు, 35 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులతో పాటు పాత కేసులకు సంబంధించిన ఆరుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని కొత్తపేటకు చెందిన సింగం నరేష్ వద్ద నుంచి 672 కర్ణాటక 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు, కొచ్చెర్వుకు చెందిన కటిక దాసు వద్ద 5 లీటర్ల నాటు సారా, ప్యాపిలి మండలం అలేబాద్‌తండాకు చెందిన ముడావత్ స్వామి నాయక్ వద్ద నుంచి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే గ్రామానికి చెందిన ఆరుగురు పాత కేసుల్లో ముద్దాయిలుగా ఉండి తప్పించుకోని తిరుగుతండటంతో వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ మధుసూదన్, సిబ్బంది జయచంద్ర, నరసింహ, శంకర్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సీఎం రాకేష్

డోన్ టౌన్ : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ సీఎం రాకేష్, ఎస్ఐ మమత అన్నారు. శక్తి టీం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం గుమ్మకొండ గ్రామంలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైం, మహిళా రక్షణ, మత్తు పదార్థాలు, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో తెలియని వెబ్ సైట్లను ఓపెన్ చేయకుండా తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. అత్యవసర సమయంలో 100, 112కు కాల్ చేస్తే తక్షణ పోలీసు సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గోపాల్,సిబ్బంది ఉన్నారు.

యాదవులు ఐకమత్యంగా ఉండాలి

బనగానపల్లె రూరల్: యాదవులు ఐకమత్యంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని పలుకూరు గ్రామంలో గ్రామ యాదవ మహాసభ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభ మండల అధ్యక్షుడు ఘనమద్దిలేటి, నాయకులు బాలస్వామియాదవ్, శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శిగా రామాంజనేయులు

డోన్ టౌన్ : సీపీఎం మండల కార్యదర్శిగా రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా సీనియర్ నాయకులు ఎల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రామాంజనేయులును ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా నాగమద్దయ్య, భాస్కర్ రెడ్డి, సుబ్బరాయుడు, సుధాకర్, శివరంగస్వామి, మధుసూదన నాయుడు, శ్రీను, లోక్‌నాథ్, నరసింహులును ఎన్నుకున్నారు.

మాలిక్‌బాబాను దర్శించుకున్న జిల్లా జడ్జి



బాబాను దర్శించుకుంటున్న జడ్జి కమలాదేవి

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని శ్రీరామచంద్రమాలిక్ బాబాను జిల్లా జడ్జి కమలాదేవి దంపతులు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాలిక్‌బాబా సంస్థాన్ కమిటీ పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద పండితులచే ఆశీర్వాదం, తీర్థప్రసాద వితరణతో పాటు మాలిక్‌బాబా చిత్ర పటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మర్రి కృష్ణమూర్తి, న్యాయవాది నరసింహులు, శివప్రకాష్, వీరేష్, నాగభూషణం, ప్రసాద్ తదితరులు ఉన్నారు.